క్లుప్తంగా

ఏలేశ్వరం తహసీల్దార్‌గా రంగారావు



ఏలేశ్వరం: స్థానిక తహసీల్దార్‌గా వై.రంగారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. నూజివీడు జిల్లా కలక్టరేట్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన చిన్నారావు పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ రంగారావు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తామన్నారు. నూతన తహసీల్దార్ రంగారావుకు పలువురు అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కిర్లంపూడిలో ప్రొక్లెయిన్‌తో వ్యర్థాల తొలగింపు

కిర్లంపూడి: జగపతినగరం పంచాయతీ పరిధిలోని కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లో శనివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది డ్రైన్లలో పూడిక తీశారు. రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సర్పంచ్ శ్రీలత సూచించారు.

విద్యార్థులకు ఒకేషనల్ కోర్సుపై అవగాహన



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఒకేషనల్ కోర్సుపై అవగాహన కల్పించారు. ఆటో మోటివ్ ట్రేడ్ శిక్షణలో భాగంగా ఉపాధ్యాయుడు మహేష్ పర్యవేక్షణలో విద్యార్థులు ఆర్టీసీ డిపోను సందర్శించారు. అగ్రికల్చర్ ట్రేడ్‌లో భాగంగా ఉపాధ్యాయుడు డి.శివాజీ ఆధ్వర్యంలో రైసు మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం బెన్నా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఒకేషనల్ కోర్సుపై అవగాహన కలించామన్నారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.చిన్నిబాబు, లోవ ప్రసాద్, శ్రీరాం, ఏసుబాబు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

గండేపల్లి: శరీరంలో కణాలు అస్తవ్యస్తంగా పెరిగిపోవడం వలన కణితలు ఏర్పడి అవి క్యాన్సర్లుగా రూపాంతరం చెందుతాయని కాకినాడ మెడికోవర్ ఆసుపత్రి వైద్యులు ప్రదీప్ భాస్కర్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో విద్యార్థులు, సిబ్బందికి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు జాగ్రత్త చర్యలతోనే క్యాన్సర్ నివారణ సాధ్యమన్నారు. క్యాన్సర్ లక్షణాలు, రోగ నిర్ధారణ, నివారణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు చర్యలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జిల్లా దేవదాయశాఖ అధికారి పులి నారాయణమూర్తి శనివారం తెలిపారు. నోటిఫికేషన్ వివరాలను ఆలయ ఈఓ ఉండమట్ల రాజేష్ ఆధ్వర్యంలో సామివారి ఆలయం, గ్రామ పంచాయతీ, వీఆర్వో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నోటీస్ బోర్డులో అతికించారు. ఆసక్తి గల భక్తులు 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ సూచించారు.

సారా కాస్తున్న ఇద్దరి అరెస్ట్

కిర్లంపూడి: సారా కాస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి 30 లీటర్ల సారా, 800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు కిర్లంపూడి ఇన్‌చార్జి ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. మండలంలోని తామరాడ ఏలేరు కాలువ గట్టుపై సారా తయారు చేస్తున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు శనివారం జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో దాడి చేశారు. సారా కాస్తున్న నూకమహాంతి రాంబాబు, కంబం దొరబాబును అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. నిందితులను ప్రత్తిపాడు కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

పోరాటానికి టీడీపీ సిద్ధం

జగ్గంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95 శాతం అమలు చేశామని చెప్పుకోవడం సరికాదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. జగన్ పాలనపై యుద్ధం చేయడానికి టీడీపీ సిద్ధంగా ఉందన్నారు.



కిర్లంపూడి మండలం సింహాద్రిపురం నుంచి సిద్ధం సభకు బయలుదేరిన జనం



ప్రత్తిపాడు నుంచి బయలుదేరిన ఎంపీపీ కాంతి సుధాకర్, జెడ్పీటీసీ రాజరాజేశ్వరి తదితరులు



గోకవరం నుంచి సిద్ధం సభకు వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రౌతులపూడి మండలం నుంచి సిద్ధం సభకు బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- సిద్ధం బహిరంగ సభకు భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, జనం
- గ్రామాల్లో జెండా ఊపి బస్సులను ప్రారంభించిన నాయకులు



బెండపూడి నుంచి బయలు దేరిన తుని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులు

తుని/తునిరూరల్/గోకవరం/రౌతులపూడి/ప్రత్తిపాడు/ప్రత్తిపాడురూరల్/కిర్లంపూడి/అన్నవరం/కోటనందూరు/గండేపల్లి/తొండంగి/శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలేరు జిల్లా దెందులూరులో శనివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు తరలివెళ్లారు. ప్రతి మండలం నుంచి బస్సులు, కార్లు, ప్రత్యేక వాహనాల్లో దెందులూరుకు బయలుదేరారు. ఆయా మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు జెండా ఊపి బస్సులు, కార్లను ప్రారంభించారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా నాయకత్వంలో తుని మండలం నుంచి వేలాది మంది ప్రత్యేక వాహనాల్లో బహిరంగ సభకు తరలివెళ్లారు. దెందులూరు వెళ్లిన వారిలో ఆత్మ చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, జెడ్పీటీసీ పోతల సూర్యమణి, పార్టీ మండల కన్వీనర్ దుంగల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రౌతులపూడి మండలం నుంచి..

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో రౌతులపూడి మండలంలోని 26 పంచాయితీల నుంచి 14 బస్సులు, వంద కార్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. అన్నవరం ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్ వాసిరెడ్డి జమీలు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వాసిరెడ్డి లక్ష్మీభాస్కర బాబు, సూరెడ్డి సాయి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అన్నవరం నుంచి పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సుబ్బారావుతో కలిసి దెందులూరు బయలుదేరి వెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీటీసీ దడాల సతీష్, కొండపల్లి అప్పారావు, వైస్‌సర్పంచ్ ఒబిలి వెంకన్నబాబు తదితరులు ఉన్నారు.

కిర్లంపూడి నుంచి 20 బస్సుల్లో..

వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఆదేశాల మేరకు తోట బాబ్జీ ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం నుంచి సుమారు 20 బస్సుల్లో పార్టీ నాయకులు, పలువురు అభిమానులు తరలివెళ్లారు.

జగ్గంపేట నియోజకవర్గం నుంచి 7,500 మంది..

ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 82 బస్సులు, 200 కార్లలో 7,500 మంది తరలివెళ్లారు. గోకవరం మండలం నుంచి 25 బస్సులు, 20 కార్లలో రెండు వేల మంది తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, కర్రి సూరారెడ్డి, దాసరి చినబాబు, సమ్మెటి మోహన్, అక్షింతల రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 16 బస్సులు, 15 కార్లలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు దెందులూరుకు బయలుదేరి వెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీపీ గోర్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ బెహరా దొరబాబు తదితరులు ఉన్నారు. శంఖవరం మండలం నుంచి ఎంపీపీ పర్వత రాజబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. దెందులూరు వెళ్లే వాహనాలను శంఖవరంలో ఎంపీపీ పర్వత రాజబాబు జెండా ఊపి ప్రారంభించారు. గండేపల్లి మండలం నుంచి బయలుదేరిన బస్సులను ఎంపీపీ చలగళ్ల దొరబాబు జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు తదితరులు ఉన్నారు. కోటనందూరు మండలం నుంచి ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో 15 బస్సులు, ఆటోలు, కార్లలో సుమారుగా 1000 మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు దెందులూరుకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఏఏబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, కో ఆప్షన్ సభ్యుడు కోటసత్తిబాబు పాల్గొన్నారు.



శంఖవరంలో వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు

తుని నియోజకవర్గం నుంచి ఉరకలేస్తూ...

ఏలూరు జిల్లా దెందులూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు తుని నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు తుని పట్టణం, కోటనందూరు, తుని, తొండంగి మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు జాతీయ రహదారిపై బెండపూడి శివారులోని ఓ ప్రైవేటు దాబా వద్దకు చేరుకున్నారు. అక్కడ బస్సులను వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, గాబు రాజు తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 60 బస్సుల్లో పార్టీ శ్రేణులు సిద్ధం సభకు తరలివెళ్లారు.

సిద్ధం సభకు విశేష స్పందన



యర్రవరంలో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. యర్రవరంలో సిద్ధం సభకు వెళ్లే ప్రత్యేక వాహనాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సిద్ధం సభకు వేలాది మంది జనం తరలివచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోర్ల కాంతిసుధాకర్, పార్టీ నాయకులు అలమండ చలమయ్య, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం



జగ్గంపేటలో బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని మాజీ మంత్రి, ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. ఏలూరు జిల్లా దెందులూరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు వెళ్లే వాహనాలకు జగ్గంపేటలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా బస్సు, కార్లలో దెందులూరికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, తోట రాంజీ, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ, పార్టీ నేతలు అత్తులూరి సాయిబాబు, పెద్దాడ రాజబాబు, గఫూర్, నకిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రత్తిపాడు: పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రత్తిపాడు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద శనివారం కార్మికులు ధర్నా చేపట్టారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కొక్క విద్యార్థికి రూ.20 వంతున చెల్లించాలని, పని భద్రత కల్పించాలని, ఏడాదికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబుకు అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మంగలక్ష్మి, అనంత లక్ష్మి, సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు, ఎండీఎం సంఘ నాయకులు సీతామహాలక్ష్మి, పుష్ప, లక్ష్మీకుమారి, మల్లేశ్వరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ఎంఈఓ రాజబాబుకు వినతిపత్రం అందిస్తున్న మిడ్డే మీల్స్ కార్మికులు

236 మద్యం బాటిళ్లు స్వాధీనం

తొండంగి: తీరప్రాంతం అద్దరిపేటలో అక్రమంగా నిల్వ ఉంచిన 236 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎస్సై బి.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఎక్సైజ్ సూపరింటిండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు అద్దరిపేటలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జి.బంగారమ్మను అరెస్టు చేయగా మరో ఇద్దరు గరికిన శ్రీను, మచ్చ వీరబాబు పరారయ్యారు. వీరి నుంచి 236 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో హెచ్‌సీ ప్రసాద్, కానిస్టేబుళ్లు రమణ, నవీన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



అద్దరిపేటలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

తాళ్లూరు మఠంలో అన్నసమారాధన

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు మఠంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల ఆర్థిక సాయంతో ఈ అన్నదానం నిర్వహించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

ఏం కష్టం వచ్చిందో ఆ తల్లికి...!

- ఏడాది బాలుడిని కాలనీలో వదిలేసిన వైనం

జగ్గంపేట: స్థానిక నెహ్రూ కాలనీలోని చర్చి వద్ద ఏడాది వయస్సు గల బాలుడుని తల్లి వదిలి వెళ్లిపోయింది. అక్కడ ఒక లెటర్ పెట్టింది. బాలుడిని తీసుకున్న వారు బాగా చూసుకోవాలని ఆ లెటర్‌లో ఉంది. స్థానిక పాస్టర్ బాలుడిని పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. బాలుడు తల్లిదండ్రుల ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు తెలిపారు.



జగ్గంపేట నెహ్రూ కాలనీలో దొరికిన బాలుడు

కత్తిపూడి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

తొండంగి: మండలంలోని బెండపూడికి కోడిదాసు సత్యనారాయణ అనారోగ్యానికి గురై కత్తిపూడి రిఫరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను పింఛను లబ్ధిదారుడు కావడంతో గ్రామ వలంటీర్ శివకుమార్ సొంతఖర్చులతో ఆస్పత్రికి వెళ్లి సత్యనారాయణకు వృద్ధాప్య పింఛన్ అందజేశాడు. అదే గ్రామానికి చెందిన మరో పింఛను లబ్ధిదారు షేక్ ఫాతిమా బీబీ గొల్లప్రోలులో ఉందని తెలుసుకుని అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశాడు. మానవత్వం చాటిన వలంటీర్ శివకుమార్‌ను ఎంపీడీఓ పసుపులేటి సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి, మద్దుకూరి వీర వెంకటసత్యనారాయణ, సర్పంచ్ ఏలేటి దుర్గాదేవి తదితరులు అభినందించారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

తుని: స్థానిక అమ్మాజీపేటకు చెందిన వాడబోయిన బుచ్చమ్మ అనారోగ్యంతో నర్సీపట్నంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పింఛను లబ్ధిదారు కావడంతో వార్డు వలంటీర్ సురంపల్లి జ్యోతి శనివారం సొంత ఖర్చులతో బస్సులో నర్సీపట్నం వెళ్లి బుచ్చమ్మకు పింఛన్ అందజేసింది. వలంటీర్ జ్యోతిని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరి సుధారాణి, కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను, సచివాలయ సిబ్బంది అభినందించారు.



నర్సీపట్నం ఆసుపత్రిలో బుచ్చమ్మకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ జ్యోతి

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

తొండంగి: టిప్పర్లు అతివేగంగా వెళ్లడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని రావికంపాడు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం టిప్పర్లను అడ్డుకుని ఆందోళన చేశారు. నిత్యం వందలాది లారీలు తీరప్రాంతంలో పరిశ్రమల నిర్మాణాలకు భారీ రాళ్లు, గ్రావెల్ ఇతర మెటీరియల్‌ను తరలిస్తున్నాయన్నారు. తరచూ టిప్పర్ల నుంచి బండరాళ్లు రోడ్డుపై పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ వాహనాలను గ్రామంలో నిలిపివేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అక్కడకు చేరుకుని టిప్పర్ల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు వేస్తామని, వాటి నుంచి రాళ్లు పడిపోకుండా చర్యలు తీసుకుంటామని తెలపడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

దశాబ్దాల కల సాకారం

- వందేళ్ల నాటి భూ సమస్యకు పరిష్కారం
- వైఎస్సార్ శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో మేలు
- లబ్ధిదారులకు భూమిపై సంపూర్ణ హక్కులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రత్తిపాడు: దశాబ్దాలుగా మాన్యం భూములపై హక్కులు లేకపోవడంతో అనుభవదారులు పడుతున్న ఇక్కట్లు వర్ణణాతీతం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయారు. అధికారులకిచ్చిన అర్జీలు బుట్టదాఖలాయ్యాయే తప్ప సమస్యకు పరిష్కారం దొరకలేదు. ఇక ఆ భూములపై ఆశలు వదిలేసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ శాశ్వత భూహక్కు – భూరక్ష' పథకం వారి ఆశలకు ఊపిరిపోసింది. దశాబ్దాల కలను సాకారం చేసింది. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ చొరవతో ప్రత్తిపాడు గ్రామ మాదిగ మాన్యం (చమారు నౌకరీ ఈనాం) భూముల లబ్ధిదారులకు పట్టాలు అందాయి. వందేళ్ల నాటి భూ సమస్య పరిష్కారం కావడంతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది.

వందేళ్ల క్రితం చర్మకారులకు భూమి

వందేళ్ల క్రితం జమీందార్లు తమ ఇళ్లలో పని చేసే, సేవలు అందించే వ్యక్తులకు కొంత భూమిని మాన్యాలు (ఈనాం)గా ఇచ్చేవారు. ఆ పేదలు ఈ భూములను పండించుకొని ఫలసాయం అనుభవిస్తూ జీవించే వారు. ఆ క్రమంలో పెద్దాపురం జమిందారు తన భూమి నుంచి ప్రత్తిపాడు మాదిగ సామాజిక వర్గానికి చెందిన చర్మకారులకు 'సర్వీసు ఈనాం (చమారు నౌకరి ఈనాం, మాదిగ మాన్యం)' పేరిట కొంత భూమిని ఇచ్చారు. ప్రత్తిపాడు గ్రామ సర్వే నంబరు 313బై6లో 2–92 ఎకరాలు, 316బై1లో 0–07 ఎకరాలు, 316బై3లో 2–70 ఎకరాలు వెరసి 5–69 ఎకరాల భూమిని చర్మకారుల కుటుంబాలకు ఇచ్చారు. 1947లో స్వాతంత్య్రం వచ్చింది. 1950లో అప్పటి హోం శాఖ మంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ ఎస్టేటు, ఈనాంలను రద్దు చేశారు. అప్పట్లో సాగులో ఉన్న రైతులకు రైతు వారీ పట్టా ఇవ్వాలి. కానీ అది జరగలేదు. ఇదిలా ఉండగా 1965లో భూమి హక్కుదారులకు పట్టాలు ఇచ్చారు. మునసబు, కరణాలకు మామూలు (లంచం) ఇవ్వలేదనే సాకుతో మోర్త గంగరాజు కుమారుడు నూకరాజుకు 3–98 పట్టా ఇవ్వలేదు. 2006–07లో ఇందిరమ్మ కాలనీలకు స్థల సేకరణ సమయంలో చమారు నౌకరి ఈనాం భూమి మోర్త నూకరాజుకు చెందినదిగా అప్పటి పెద్దాపురం ఆర్డీఓ తెలపడంతో ఈ భూ సమస్య మళ్లీ తెరమీదకి వచ్చింది. అప్పటి నుంచి నూకరాజు వారసులు భూ పట్టా కోసం అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఎమ్మార్వో నుంచి లోకాయుక్త వరకూ అర్జీలు దాఖలు చేస్తూనే ఉన్నారు.



ప్రత్తిపాడులో ఈనాం భూమిని సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎట్టకేలకు పరిష్కారం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ భూహక్కు–భూరక్ష' పథకంలో చమారు నౌకరీ ఈనాం (మాదిగ మాన్యం) భూమికి మోక్షం లభించింది. ఈపథకంలో రెవెన్యూ అధికారులు సర్వే జరిపి, వారసులను నిర్ధారించారు. 3.98 ఎకరాల భూమికి 11 మందిని వారసులుగా నిర్ధారించి, పట్టాలను అందజేశారు. తమ చేతికి పట్టాలు అందడంతో సాగుదారులు హర్షం వ్యక్తం చేశారు.

తహసీల్దార్ చొరవతోనే పట్టాలు



ఎన్నో ఏళ్లుగా మా సాగులో ఉన్న భూమికి పట్టాలు అడిగాం. ఎమ్మార్వో మొదలు కొని జిల్లా కలెక్టర్, చివరకు లోకాయుక్తను కూడా ఆశ్రయించాం. చేతిలో పైసా లేక, చేసేది లేక మిన్నకుండిపోయాం. తహసీల్దార్ చొరవతో మా భూమికి పట్టాలు వచ్చాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా ఆశలకు ఊపిరిపోశారు.

– మోర్త రాజేంద్ర ప్రసాద్, మాదిగ మాన్యం హక్కుదారుడు, ప్రత్తిపాడు

సర్వేలో వారసులను గుర్తించాం



భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంలో సర్వే చేసి మాదిగ మాన్యం హద్దులను గుర్తించాం. 11 మంది వారసులను నిర్ధారించి, వారికి శాశ్వత పట్టాలు పంపిణీ చేశాం.

– పీవీవీ గోపాలకృష్ణ, తహసీల్దార్, ప్రత్తిపాడు

జగ్గంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

జగ్గంపేట: అధికారుల వేధింపులకు అసువులుబాసిన గ్రామ వ్యవసాయ సహాయకురాలు బెల్లంకొండ పూజిత ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ జగ్గంపేటలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేసి ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు జాన్ క్రిస్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.